
# నిజం

- కె. వరలక్ష్మి



ఆకులమడుగు సంస్థానంలో ఆ రోజు పండుగనుమించి సందడిగా ఉంది. సంస్థానాధీశుడు శ్రీ వత్సవాయి బుచ్చిరాజుగారి దేవేరి.... రాణీ సావిత్రీదేవి పెళ్లైన పదేళ్లకి గర్భం ధరించిన సందర్భంగా ఆ జమీం దార్లు చీరె సారెలు, విలువైన ఆభర ణాలు, రకరకాల తినుబండారాలు కానుకలుగా పంపిస్తున్నారు.

ఎన్ని గుర్రాలు, బండ్లు వస్తున్నాయో; కాలి బంట్లు, దాసదాసీలు ఎందరు వస్తున్నారో ముందు గానే కబురందడం వలన అందరికీ భారీగా వంటలు జరుగుతున్నాయి.

అదంతా ఒక ఎత్తు, జనానాలో సావిత్రీదేవి ఆధ్వర్యంలో జరుగుతున్న వంటలు ఒక ఎత్తు. ఉదయం నుంచి నిల్చిన చోట నిలవకుండా తిరుగుతూ వంట కాళ్ని పురమాయిస్తున్న సావిత్రిని చూసి అమ్మలక్కలంతా ముక్కున వేలేసుకుంటున్నారు.

నెలతప్పినప్పట్నుంచి 'నాదేనమ్మా వైభోగం' అని తల్పం మీది నుంచి కాలు కింద పెట్టకుండా సాగించుకుంటున్న రాణీగార్ని గురించి గుసగుసలు పోయినవాళ్లే 'ఇదేం చోద్యమ'ని విస్తుపోతున్నారు. ఎంత పుట్టింటి వాళ్లు జమీందార్లైతే మాత్రం మరీ ఇంత 'ఇది' కూడదని చెవులు కొరుక్కుంటున్నారు.

జీడిపప్పు అద్దిన తొక్కుడు మిఠాయి ఉండలు, పచ్చిబియ్యం పాయసం. పెరుగుగారెలు, కమ్మని నెయ్యిపోసి చుట్టిన మినపసున్ని, నోట్లో వేసుకోగానే కరిగిపోయే పూతరేకులు, గడ్డపెరుగు కొసరి కొసరి రుచిచూసి మరీ ఓ పక్కన పెట్టించింది సావిత్రీదేవి. సంతోషవార్తను వేగుల ద్వారా అందుకున్న పుట్టింటి వారు కాకర్లపూడి జమీందార్లు. మాటి మాటికీ దేవిడీ సింహద్వారపు తెరలు తొలగించి ఆవరణలోకి తొంగి చూడడం.

'పాపం, పదేళ్ళ తర్వాత పుట్టింటి వారిని చూడబోతున్నాననే ఆనందం దీన్నెక్కడా నిలవ నివ్వడం లేదు'. అని జాలిపడింది అత్తగారు. "అమ్మాయీ, అసలే ఉత్తమనిషివి కావు, వచ్చే వాళ్లెలాగూ రాకపోరు. ముందు నువ్వు కాస్త ఎంగిలిపడు" అంది కాస్త మందలింపుగా.

అత్తగారి మాట కాదనలేక సావిత్రి భోజనం ముందు కూర్చుందన్నమాటేగాని ముద్దగొంతు దిగడంలేదు. వంటలక్కరుచి చూడమని ఇచ్చిన జిలేబీని అలాగే చూస్తూ 'ఇదికూడా బావకి ఇష్టమైనదే' అనుకుంది.

బావను చూడాలని ఆమె మనసు ఆత్రపడుతోంది. రంగరాజు చేత బహుమతులు పంపిస్తున్నానని తండ్రి జాబు పంపినప్పటి నుంచి ఆమె మనసు మనసులో లేకుండా పోయింది.

ఆమె ఆలోచనలు పదేళ్ళవెనక్కి గతంలోకి పరుగులెత్తేయి-రంగరాజు సావిత్రికి మేనత్తకొడుకు, కొడుకు పుట్టగానే తలచెడి పుట్టింటికి చేరుకున్న మేనత్త, పెళ్లికి ముందంతా నాది అనుకున్న పుట్టిల్లు ఇప్పుడు తనను చేరదీసిన పరాయి ఇల్లు అన్న నిజాన్ని గ్రహించి అణకువగా అణిగీమణిగీ నడుచుకునేది, దానికి తోడు భర్తబతికుండగా హారతి కర్పూరంలా ఆస్తులన్నీ కరిగించెయ్యడంతో భుక్తికి అన్నగారి మీద ఆధారపడక తప్పని పరిస్థితి. కొడుకును కూడా అలాగే అణకువనేర్పి పెంచిందావిడ. తండ్రిపోయి నిరాధారంగా ఉన్న తమని మేనమామ ఆదుకున్నాడన్న కృతజ్ఞత రంగరాజు నరనరానా నిండి ఉండేది. రంగరాజుకి ఆరేళ్ళ వయసున్నప్పుడు సావిత్రి పుట్టింది. బాల్యంనుంచి సావిత్రిని ఎత్తుకోవడం, మురిపెం చెయ్యడం, ఆడించడం అన్నీ రంగరాజే.

క్రమంగా సావిత్రికి రంగరాజు తోడిదే లోకమైంది. చంకనెక్కి తిరగడం మానేసాక అతని చిటికెనవేలు పుచ్చుకుని తిరుగుతూండేది. పన్నెండేళ్ళవయసుకే పసిమిచాయతో మణులు పొదిగిన సాలభంజికలా మెరిసిపోయేది సావిత్రి.

నూనూగు మీసాల నూత్న యవ్వనంలోకి అడుగుపెట్టిన రంగరాజు చెక్కిన శిల్పంలా ధృఢంగా ఉండేవాడు. కలిసి తినడం, కలిసి తిరగడం సహజంగానే వాళ్లమధ్య సాన్నిహిత్యాన్ని పెంచాయి. 'బావను చూడకుండా క్షణం ఉండలేను' అనుకునేది సావిత్రి. అతనికిష్టమైన తీపి వంటకాలన్నీ తనకిష్టం అని చేయించి అతనికి కొసరి కొసరి తినిపించేది.

> ## ఆల్ ది బెస్ట్
>
> "చినుకు" పేరులోనే ఒక స్పర్శ ఉంది. శబ్దం ఉంది. తడి అనుభూతి ఉంది. శాటిలైట్ సూక్ష్మ రేణువులైపోయిన సమాజంలోకి మనుషుల్నీ... ముఖ్యంగా మనసుల్నీ తట్టిలేపే ఒక మంచి పత్రిక కోసం మనఃస్ఫూర్తిగా ఎదురు చూస్తున్నాం. ఆల్ ది బెస్ట్.
>
> **- దీపికారాజు**
> హైదరాబాద్

మరో ఏడాదిలో తనకి యుక్తవయసు వచ్చిందన్నారు. బావతో ముఖాముఖి మాట్లాడకూడదని, అతని వెంట తోటల్లో దొరువుల్లో తిరగకూడదని ఆంక్షలు మొదలయ్యాయి. ముఖ్యంగా తన తల్లి తమని వెయ్యి కళ్లతో గమనిస్తూ ఉండేది. "నువ్వు ఈ ప్రాంతాన్నేలుతున్న పాళెగాని కూతురువి, నీకేం ఖర్మ అలాంటి బికారి వాడితో తిరగడానికి" అంటూండేది. "నాకూతురికీ, నీకొడుక్కీ ఏనుగుకీ దోమకీ ఉన్నంత తేడా ఉంది. నువ్వేం ఆశలు పెంచుకోకమ్మోయ్" అని ఆడపడుచుని హెచ్చరిస్తూండేది.

ఎవరెన్ని ఆంక్షలు పెట్టినా సావిత్రి మాత్రం బావని అంటిపెట్టుకునే ఉండేది. ఎవరి మాటా లెక్కచేసేది కాదు.

పదిహేనేళ్ళ వయసప్పుడు తనకి పెళ్ళి సంబంధాలు చూస్తున్నారని తెలిసి ధైర్యంగా దేవిడీలోకెళ్ళి తండ్రి ఎదుట నిలబడి "నేను బావని తప్ప ఎవర్నీ పెళ్లి చేసుకోను" అని కరాఖండీగా చెప్పేసింది. సంబంధాల పట్టిక తెచ్చిన వేగును పంపించేసే వరకూ అన్నం-నీళ్లు ముట్టడం మానేసింది.

ఇక చేసేది లేక అందరూ దిగి వచ్చేరు. మహూర్తం నిర్ణయించి పెళ్లి ఏర్పాట్లన్నీ చేసేరు.

తెల్లవారితే పెళ్ళి అనగా ఆ రాత్రి ఉన్నట్టుండి రంగరాజుకేమైందో తెలీదు, కన్పించకుండా పోయాడు. దివాణంలోని కొంత సొమ్ము, నగలు తీసుకుని పరారైపోయాడని అందరూ చెప్పుకున్నారు. అంతేకాదు, 'స్వహస్తాల్తో పెంచిన సావిత్రిని వివాహమాడడం నాకిష్టంలేదు' అంటూ అతను స్వయంగా రాసిన ఉత్తరం దొరికింది. తన మనసు విరిగిపోయి ముక్కచెక్కలైంది. బావకాదన్నాక ఇక ఎవరైతే ఏం అనే నిర్లిప్తతతో తలవంచింది. చిత్రంగా-తన పెళ్లి చూడాలని మందీ మార్బలంతో తరలివచ్చిన బుచ్చి

రాయలుతో అదే ముహూ ర్తానికి తన పెళ్ళి జరిగి పోయింది. సావిత్రి కాస్తా రాణీ సావిత్రీదేవి అయ్యింది.

ఆనాడు పసుపు బట్టల్తో పారాణిపాదాల్తో మేనా ఎక్కి ఇక్కడికి రావడం - తిరిగి పుట్టింటిముఖం చూడలేదు. అక్కడికెళ్తే రంగరాజు జ్ఞాపకాలు తనని దుఃఖ పెడతాయేమోనని భయం. నమ్మక ద్రోహం చేసిన రంగరాజు మీద అసహ్యం, కంటికీ మంటికీ ఏకధారగా ఏడ్చిన అత్తయ్య మీద జాలి.

## మీ కోసం

16-4-1853 న భారత దేశంలో మొదటి రైలు పరుగు ప్రారంభించింది. బొంబాయిలోని విక్టోరియా టెర్మినస్‌గా పిలవబడే వాడీ బందర్ నుండి 33 కి.మీ. దూరంలోని థానే వరకు నిర్మించబడిన రైలు మార్గంపై 57 నిమిషాలు పాటు ఈ రైలు ప్రయాణించింది. 1843లో రైల్వే ఆవశ్యకతను గుర్తించిన గవర్నర్ జనరల్ లార్డ్ డల్హౌసీ దీనికి శ్రీకారం చుట్టారు. ఈ రైల్వే నిర్మాణ బాధ్యతను 'ది గ్రేట్ ఇండియా పెనిన్సులా'కి అప్పగించారు.

అప్పుడప్పుడు అక్కడి కబుర్లుమాత్రం తెలుస్తున్నాయి. ఏముఖం పెట్టుకుని వచ్చేడో రంగరాజు త్వరలోనే తిరిగి వచ్చేడట. రెండేళ్ల క్రితం అత్తయ్య కాలం చేసిందట, కొడుకు కన్నా అమితంగా తనని గారాబం చేసిన అత్తయ్య. తనకి తెలీకుండానే చెంపమీదికి జారిన కన్నీటి చుక్కని ఎవరూ చూడకుండా ఎడమ చేత్తో చెరిపేసుకుంది.

"వచ్చేసేరొచ్చేసేరు" అని అందరూ అటూ ఇటూ పరుగులు పెడుతున్నారు. ఆదాటుగా సింహద్వారం బైటికి చూసిన సావిత్రీదేవి రెప్ప వెయ్యడం మరచిపోయి అలా చూస్తూ ఉండి పోయింది.

గుర్రపుకళ్లేన్ని పట్టుకుని ఠీవిగా నడిచి వస్తున్న దెవరు? నిలువెత్తు ఆజానుబాహువు. కోరమీసం, మొలలో చురకత్తి, నడుముపట్టాలో వేళ్లాడుతున్న కరవాలం. నిండైన బుగ్గల్తో రాజసం ఉట్టి పడుతున్న రూపం., సందేహం లేదు, అతను రంగబావే. ఆనందగా లేచి ఎదురెళ్లబోయి ఏదో గుర్తుకు రాగా విసవిసా నడుస్తూ అంతఃపురం లోపలి గుదుల్లోకి వెళ్ళిపోయింది. సేవకులు రంగరాజుని అతిథుల కోసం కేటాయించిన తోట విడిదికి తీసుకెళ్లేరు.

భోజనాల వేళకి అందరికీ చలువ పందిళ్లలో వడ్డనలు జరుగుతున్నా, బంధువు కాబట్టి రంగరాజుని రాజకుటుంబంతో కలిసి భోజనం చెయ్యడానికి దేవిడీలోకి ఆహ్వానించేరు. రంగరాజు భోజనం దగ్గర వంచిన తల ఎత్తకుండా కూర్చున్నాడు. సావిత్రీదేవికి కోపంతో ఒళ్లంతా సెగలు పొగలు వచ్చి నట్లైంది. పన్నెత్తి పలకరిస్తే అతని సొమ్మేం పోతుంది?

తన సంపద, దర్పం రంగరాజుకి చూపించడానికి సావిత్రీదేవి కావాలని నడుముకున్న మువ్వల వడ్డాణం, మెడలో మోయలేనన్ని వజ్రాల హారాలు, మోచేతుల వరకూ ఉన్న బంగారు గాజులు అన్నిటినీ సవరించుకుంటూ తన వైభవాన్ని అతను గమనిస్తున్నాడా లేదా అని ఓ కంట కనిపెడుతోంది.

భోజనానికి ఉపక్రమించబోతూ వడ్డించిన పదార్థాలన్నీ తనకిష్టమైనవేనని గ్రహించాడు రంగరాజు. తన ఇష్టాల్ని ఇంతగా గుర్తుపెట్టుకున్న సావిత్రివైపు మార్దవంగా చూడకుండా ఉండలేక పోయాడు. వ్యంగ్యంగా నవ్వింది సావిత్రి. దాసిని పిలిచి "అతను మన అతిథి. అతనికేం కావాలో దగ్గరుండి అడిగి వడ్డించు" అంది దర్పంగా. "రోజూ మాకిది మామూలే. ఎందరెందరో వచ్చి తినిపోతుంటారు" అంది స్వగతంలా. అతను చిన్నబుచ్చుకుంటే చూడాలని ఉందామెకి. రంగరాజు వంచిన తల ఎత్తడం లేదు. క్షేమ సమాచారమైనా అడగడం లేదని ఆక్రోశంగా ఉందామెకి. లేని గర్వాన్ని, కాఠిన్యాన్ని ఆపాదించుకుని మాట్లాడుతోంది సావిత్రీదేవి. ఎన్నడూలేని ఈ కొత్త ధోరణికి అంతఃపురంలో అందరూ ఆశ్చర్యపోతున్నారు.

రంగరాజు భోజనం ముగించి తన విడిదిలోకి వెళ్లేవరకు ఆమె ధోరణి మారలేదు.

ఆ తర్వాత తన గదిలోకి వెళ్లి తల్పం మీద వాలిపోయింది. దుఃఖం పొంగి వచ్చింది. ఆమె

కళ్లల్లో ఆనాటి రంగరాజు రూపం పటం కడుతోంది. సన్నగా, పీలగా బేలకళ్లతో ఎప్పుడూ నవ్వుతూ ఉండే రంగరాజు, తనకోసం ఏ కొండమీదికోతి నైనా తెచ్చి ఇచ్చే రంగరాజు, తనని చూడకుండా నిముషమైనా ఉండలేని రంగరాజు ఎంత కఠినంగా మారి పోయాడు! ఒక్కసారి పెదవి విప్పి పలకరించడాని కైనా వేలనుకానంత పాపం తనేం చేసింది? అతను నిరాకరించాకనే కదా తనీ పెళ్లి చేసుకున్నది.

సావిత్రీదేవి కళ్లు నీటిచెలమలయ్యాయి. తనని నిరాకరించి వెళ్లి ఎవత్తెను పెళ్లిచేసుకున్నాడో?

'వీడికెవడిస్తాడు పిల్లని? తాడూ బొంగరం లేనివాడు' అంటూండేవాడు నాయన, అలాంటి ఆయనే తనమీది మమకారం కొద్దీ శిఖరం దిగివచ్చి తనని అతనికిచ్చి చేస్తానంటే చేదైంది. ఎన్నాళ్లుగానో పెంచుకున్న మమకారాలన్నిటినీ తృటిలో తృంచి పడేసాడు.

ఎవరో వస్తున్న సవ్వడై తొందర తొందరగా కళ్లు తుడుచుకుంది సావిత్రీదేవి.

"అమ్మా! మిమ్మల్ని చూడాలంట, మీ పుట్టింటిదాసి వచ్చింది" అంది చెలికత్తె వచ్చి.

"ఎవరది, లోపలికి రమ్మను"

"బాగున్నారా అమ్మా, నేను జానకిని. మీరొక్కసారి వచ్చి మేము తెచ్చిన చీరె సారెలన్నీ పరికిస్తే మేమింక తిరుగుప్రయాణం అవుతాం" అంది జానకి సావిత్రి తడిసిన కళ్లని దీర్ఘంగా పరిశీలిస్తూ. పుట్టింట్లో ఉండగా సావిత్రికి ఇష్టసఖి జానకి.

"వద్దులే జానకీ, అలా ఉండనీ"

"కాదమ్మా, మేం అన్ని బళ్ల మీద తెచ్చినయ్యి మీ దేవిడీలో ఒక మూలకైనా రాలేదు. ఎంత పెద్ద భవంతులో, ఎంత స్థితిమంతులో మీ అత్తింటివారు! అందుకే, మీరిలా సిరిసంపదల్తో తుల తూగుతూ సుఖపడాలనే నాయనగారు అంతపని చేసేరు, పాపం అనైనా ఆలోచించకుండా" ఆమె అన్నది మనసుకెక్కేక ఉలిక్కిపడింది సావిత్రీదేవి.

"ఏం చేసారు నాయనగారు?"

"ఇప్పటికీ మీకు తెలీలేదామ్మా? నన్ను నమ్మమంటారా?"

"ఏంటి జానకీ నువ్వనేది?"

"మీ బావ రంగరాజు గారంటే మీకెంత ప్రాణమో, మీరంటే వారికెంత ఇష్టమో నాకు తెలీదామ్మా! పెళ్ళికి ముందు రోజు రాత్రి రంగరాజు మాయమవడం, మీ పెళ్లి ఈ బుచ్చిరాయలుంగారితో జరగడం అదంతా నాయనగారి పన్నాగమే. ఆ రాత్రి రంగరాజు ఇల్లు వదిలి వెళ్లిపోవడానికి ఇష్టపడలేదని మనుషుల్తో చితకబాదించేరు. బలవంతంగా ఆయనచేత మీరంటే ఇష్టం లేదని రాయించేరు. మిమ్మల్ని ప్రాణంగా ప్రేమిస్తున్నానని పదే పదే అంటున్నారని నాలుక కత్తిరించేసారు. ఆ దెబ్బలకీ, ఆ రక్తపాతానికీ సొమ్మసిల్లిపోయిన ఆయన్ని దూరంగా కొండకోనల్లో పడేయించేరు, పెళ్లి ఇష్టం లేక చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోయేడని పుకారు పుట్టించి ఈ బుచ్చిరాయలుంగారితో మీ పెళ్లి జరిపించేరు. నిజానికి మీ పెళ్లి అప్పటికప్పుడు అనుకుని జరిగింది కాదు. మీకిద్దరికీ తెలీకుండా జాగ్రత్తపడ్డారు. లేకపోతే మీపెళ్లి చూడ్డానికి ఈ బుచ్చిరాయలుంగారు అంతమందీ మార్బలంతో రావలసిన అవసరం ఏముంది?"

"నిజంగానా, నాయన గారు అంతపని చేసారా? అందుకా బావ నన్ను పలకరించ లేకపోయింది?'' నిర్ఘాంతపోతూ భోరు మంది సావిత్రీదేవి.

"అలాంటి అన్యాయాలు ఊరికే పోతాయేంటమ్మా, అందుకే మీ నాయన

> 'జగ్గంపేట' దాని చుట్టు ప్రక్కల గ్రామాలలో పెరిగిపోతున్న పారిశ్రామికీకరణ అక్కడి మనుష్యుల బతుకులలో తీసుకువచ్చిన మార్పే వరలక్ష్మి కథావస్తువు. అనేకసార్లు తానా, ఆటా నిర్వహించిన కథల పోటీలలో బహుమతిని పొందిన ఈమె 'చాసో స్మారక అవార్డు' ని పొందడం విశేషం. 'చినుకు' పాఠకుల కోసం ఒక చారిత్రక కథని అందిస్తున్నారు.

గారూ, మీ అమ్మయ్య గారూ మంచాలు పట్టి మరణిస్తున్నారు. వైద్యులకి లొంగని మొండి రోగా లేయో పట్టుకున్నాయి. అప్పుడు వద్దనుకున్న మేనల్లుడే ఇప్పుడు గతి అయ్యేడు. పాపం, ఏ దేవుడు కరుణించేడో కడ్రప్రాణం నుంచి బైటపడి రంగరాజు ఏడాది తర్వాత కోలుకుని వచ్చేడు. తల్లిని తీసుకుని దూరంగా ఎక్కడికో వెళ్లిపోయేడు. చివరి రోజుల్లో మీ మేనత్త కలవరిస్తూంటే రెండేళ్లక్రితం తీసుకుని వచ్చేడు. ఆయమ్మ కాలంచేసేక తిరిగి వెళ్లిపో బోతుంటే "చచ్చిన పాముల్ని ఇంకా కొట్టకురా రంగా" అంటూ నాయనగారు చేతులు పట్టుకున్నా రంట. రంగరాజుది మెత్తని మనసు కాబట్టి ఆగిపోయి మేనమామనీ, అత్తనీ కంటికి రెప్పలాగ చూసుకుంటున్నాడు. ఒక పెళ్లనడు, సంసార మనడు. ఏదో లోకంలో అలాగ మౌనయోగంలో ఉంటాడు. మాటాడలేడు కాబట్టి నాయనగారి పాళెగారితనం ఈయనగారికి రాదంట, ఏంటో, ఎనక కాలానికి లేకలేక కలిగిన సంతానం మీరు. మిమ్మల్ని మీ బావకిచ్చి చేసి ఇద్దర్నీ కళ్లముందు చూసుకుంటా ఉంటే ఎంత బాగుండేది! ఆస్థిపాస్తుల కాశపడి మిమ్మల్నింత దూరానికిచ్చేరు. బావ పెళ్లాడలేదని అలిగి మీరు అటువైపు రావడం మానేసేరు. అదంతా ఆరి దురదృష్టం. ఎళ్లొస్తా సావిత్రమ్మ తల్లీ! రంగరాజు మిమ్మల్ని పలకరించ లేదని దుఃఖపడకమ్మా, అసలే ఉత్తమనిషివి కావు"

"బావెక్కడున్నాడు? క్షమించమని నేనతని కాళ్లమీదపడాలి" అంది సావిత్రి లేచి నిలబడి.

"ఇంకా ఎక్కడున్నారు, మమ్మల్ని వెనక రమ్మని మధ్యాహ్నం భోజనం అవగానే బయులుదేరి వెళ్లిపోయేరు. మీకు పుట్టబోయే బిడ్డకి దీన్ని తన బహుమతిగా ఇమ్మన్నారు. అని ఒక చిన్న ఆభరణాల పెట్టె అందించింది జానకి. మూత తీసి చూస్తే... పెళ్లి దగ్గరకొస్తున్నదని ఆనాడు బావమెడలో మురిపెంగా తను వేసిన చంద్రహారం గొలుసు.

- శ్రీమతి కె. వరలక్ష్మి
శ్రీ రవీంద్ర నిలయం
శ్రీరామ్ నగర్, జగ్గంపేట - 533435.

# నెత్తుటి పిలుపు

- డా॥ మోక్షప్రసూన

రక్తం గురించి మాకంటే మీ కెక్కువ తెలుసా?
ముప్పై రోజుల్లో మూడు రోజులు రహస్య
రుధిరమవుతాం

రక్తంతో నేలంతా కల్లాపి చల్లి
లేలేత పొత్తిళ్ల కింద రంగవల్లులద్ది
మనరేపటి ఆశల్ని సంకనెత్తుకుంటాం
మాకు రక్తమంటే పుట్టుక అని తెలుసు
రక్తమంటే ప్రాణమని తెలుసు
రక్తాన్ని చెమటగా మార్చటం తెలుసు
ఆ స్వేదాన్ని మట్టిలో నాటి
క్రొంగొత్త ఆశల మొలకల్ని పెంచటం తెలుసు
చేజేతుల ప్రాణం నిలిపే చెట్లని నరకడం
మాకు తెలియదు !

ప్రతినిత్యం కత్తులన్నీ పసిపిల్లలై
వంట ఇంటి వాకిట్లో కాళ్ళకు అడ్డం పడతాయి
ఆయుధాలు కడుపునింపడానికే కాని
కడుపు కోతకోసం కాదని తెలుసు
ఆయుధాలు అలవాటైనవాళ్ళం
రక్తం అంటే భయంలేని వాళ్ళం
మేము నరకడం లేదే
మాకు ప్రాణం విలువ
శాంతి విలువ తెలుసు
అందుకే మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాం
రండి

ఫ్యాక్షన్ ఉక్కు సంకెళ్ళని ఛేదించుకొని
స్వేచ్ఛా నీలాకాశాల పందిరికింద
లేలేత సూర్యుని వెలుగులో
ఈ నెత్తుటి పిలుపునందుకొని, రండి
ఏ వివక్షలూ లేని సమానత్వపు నీడలో
మసిపట్టిన మనసు అద్దాలను
క్షమతో ప్రేమతో ప్రక్షాళన చేసుకుందాం !

❖ ❖ ❖